# దీపావళి సిసింద్రీలు మినీ మినీ కథలు




"రెండు ప్లేట్లు పెసరట్టు, రెండు ప్లేటు ఉప్మా" సర్వరుకి ఆర్డరిచ్చి కబుర్లలో పడ్డారు నిర్మల, నీరజ.

వాళ్ళిద్దరూ ఆ హోటల్ ప్రక్కనేవున్న కాలేజీలో బి.ఏ. ఆఖరు సంవత్సరం చదువుతున్నారు.

"ఆ కౌంటరులో కూర్చున్నతను చూడవే యిందాకటినుంచి మనవైపే చూసున్నాడు" నీరజ అంది.

"అతనా అతనీ హోటల్ ప్రొప్రయిటర్ కొడుకుట. మూడు రోజులనుంచి చూస్తున్నాను. అతను మనవైపే చూసున్నాడు. పైకి మర్యాదగా కనిపిస్తారు. అందమైన ఆడపిల్లలు కన్పించేసరికి సభ్యత మరిచిపోతారు" లోపలసంతోషంగా ఉన్నా పైకి కోపాన్ని ప్రదర్శించింది నిర్మల.

"అది వాళ్ళ తప్పు కాదే తల్లీ మన నింత అందంగా పుట్టించిన ఆ దేముడి తప్పు" ఇద్దరూ పగలబడి నవ్వుకున్నారు.

"ఆ అన్నట్టు చెప్పడం మరిచిపోయాను. వీడు మొన్న నేను ఒంటరిగా కాలేజీ నుంచి యింటికి వెడుతూంటే వెనకాల పడి నిన్ను ప్రేమిస్తున్నానని ఏదేదో కూశాడు. నేను కోపంగా చూస్తే హడలిపోయి పారిపోయాడు. అందుకే నా వైపు అలా చూస్తున్నాడు" గర్వంగా అంది నిర్మల.

"అరె యితనే ఒకరోజు నేను షాపింగ్‌కి వెళ్ళి వస్తూంటే నా వెనకాల పడి లవ్ లెటర్ అందించాడు. నేను నాలుగూ దులిపితే పారిపోయాడు" నీరజ చెప్పింది.

ఇద్దరివీ అబద్ధాలేనని యిద్దరికీ తెలుసు.

## కొచ్చర్లకోట శాంతి

అతడు తన వైపు చూస్తున్నాడని నిరూపించుకోవాలని యిద్దరి ఆరాటం.

ఇద్దరికీ చాలా సంతోషంగా ఉంది. అందమైన వాడు. యింత పెద్ద హోటల్ ప్రొప్రయిటర్ కొడుకు తమవైపుఅంతగా చూస్తున్నాడంటే యిద్దరికీ చాల గర్వంగా ఉంది. కాని యిద్దరికీ బాధగానూ ఉంది. అతను ఎవరిపై ఆసక్తి కొద్దీ చూస్తున్నాడో తెలియక.

సర్వరు కొంచెం లేట్ చేస్తే బాగుండు ననిపించింది యిద్దరికీ. కానీ సర్వరు కేం తెలుసు టిఫిన్‌తో రెడీ అయ్యాడు.

ఇద్దరూ టిఫిన్ తీసుకొంటూ, అతని కేసి ఓరగా చూస్తూ, కబుర్లు చెప్పుకోవడం మొదలుపెట్టారు. అతడు మధ్య మధ్యలో వీరి వైపు చూస్తున్నాడు.

కాలేజీ టైము అయిపోయిందని తొందరగా టిఫిన్ ముగించి మళ్ళీ రేపు వచ్చి అతనిని చూడవచ్చు అని యిద్దరూ వెళదామని లేచారు.

"ఏమండీ" అన్న పిలుపుకి యిద్దరూ తలెత్తి చూశారు. ఎదురుగా అతను. ఇద్దరి గుండెలూ వేగంగా కొట్టుకున్నాయి.

ఏమిటన్నట్టు చూశారిద్దరూ అతనివైపు.

"మూడు రోజుల నుంచి చూస్తున్నాను. మీరు టిఫిన్ తిన్నాక ప్లేట్లల్లో చేతులు కడగటం ఏమీ బాగుండ లేదండీ. మేం సింకులు ఎందుకు పెట్టించాం. మీలాంటి చదువుకున్న వాళ్ళే యిలా చేస్తే ఎలాగ. ప్లేట్లు తీసుకువెళ్ళే బాయిన్‌కి కష్టం. అయినా ప్లేట్లల్లో చేతులు కడిగితే బల్లంతా దర్టీగా తయారవుతుంది. పెద్ద పెద్ద హోటల్స్‌లో అలా కడకూడదండీ. ఈ విషయం చెపుదామనే యిందాకటి నుండి చూస్తున్నాను. రేపటి నుండి దయచేసి సింకుల్లో చెయ్యి కడుక్కోండి" చెప్పేసి వెళ్ళిపోయాడతను.

మాట రాక నిలబడిపోయా రిద్దరూ.★

## భయం

ప్రతి వాడూ వచ్చి బెదిరించి
పోతున్నాడు
జీవితాన్ని చిదిమేస్తానని
జీవనాన్ని చెరిచేస్తానని
అనుభవం కలిగేటంతవరకే భయం
ఆ పైన మిగిలేది తెగింపు
తెగించిన వాడికి
తెరలుండవు—ముసుగు లుండవు
బెదిరింపు లున్నంతకాలం
భయం కాలుస్తూనే వుంటుంది
ఎదుర్రొమ్ము నిలబెట్టినప్పుడు
కళ్ళెరుపు ప్రకటించినప్పుడు
భయముండదు—బెదురుండదు
అందుకే
తల పైకెత్తి సూటిగా చూడు
ఛాతీ పొంగించి పిడికిళ్ళు బిగపట్టు

- భైరవయ్య

